అమరుల త్యాగాలు మరువలేనివి



హుజూరాబాద్‌లో మట్టితో ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు



ఇల్లందకుంటలో...



గన్నేరువరం: గుండ్లపల్లిలో...

బీజేపీ నాయకులు

హుజూరాబాద్‌: దేశ స్వాతంత్ర్యం కోసం అమరుల త్యాగాలు మరువలేనివని బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మేరీ మాటి- మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో మట్టి చేత పట్టుకుని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశం మట్టి మనందరిని కలుపుతుందనీ, మట్టికి నివాళి అర్పిస్తూ వీరులకు వందనం సమర్పించే ఉద్దేశంతో పంచప్రాణాల ప్రతిజ్ఞ చేశామన్నారు. పట్టణ ఉపాధ్యక్షులు అంకతి వాసు, తిప్పబత్తిని రాజు, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు వేణు, సీనియర్ నాయకులు గంగిశెట్టి ప్రభాకర్, కోశాధికారి యాంసాని శశిధర్, కార్యదర్శులు విజయ్, రాజు, వెంకటేశ్, బూత్ అధ్యక్షుడు ప్రభాకర్, ఉమాశంకర్, రాజేశ్‌కన్నా, నాయకులు భాస్కర్ యాదవ్, బాబర్, వినయ్ పాల్గొన్నారు.

తిమ్మాపూర్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని రామకృష్ణకాలనీలోని ఎస్సారెస్పీ స్థలంలో మేరా మాటి మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం తరుపున 750 మొక్కలు నాటారు. ఉపసర్పంచ్ గుజ్జుల ప్రణీత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లచ్చయ్య, అదనపు కార్యక్రమ అధికారి లలిత కుమారి, టెక్నికల్ అసిస్టెంట్ హరీశ్, కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు సుజాత, లావణ్య, శకుంతల, అరుణ, క్షేత్ర సహాయకులు సంగీత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నా మట్టి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి గ్రామం నుంచి సేకరించిన మట్టితో ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వసుధ వనం ఏర్పాటు చేయడం సమష్టి తత్వాన్ని పెంపొందిస్తుందన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులు, పోలీసు అమరుల కుటుంబాలను సన్మానించడం చాలా గొప్ప కార్యక్రమం అని పేర్కొన్నారు. ఈసందర్భంగా నేవీ ఆఫీసర్ ముదిగంటి రాజిరెడ్డి తల్లిదండ్రులు శేషవ్వ-సంజీవరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో దళిత మోర్చా మండల అధ్యక్షుడు రాజు, తాళ్లపల్లి పర్శరాంగౌడ్, ముదగంటి జలపతిరెడ్డి, కొమ్మెర సుధాకర్‌రెడ్డి, నర్సయ్య, చంద్రమౌళి, తిరుపతి, రాకేశ్, రామ్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో మేరీ మాటి-మేరాదేశ్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు, కార్యకర్తలు మట్టితో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. జూలై 30న మన్‌కీబాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ నా మట్టి నాదేశం కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని దేశప్రజలందరికి అందించారని, ఇందులో భాగంగా ఈ నెల 13,14,15 తేదీల్లో ప్రతి ఇల్లు, కార్యాలయాలపై, కూడలీలో జాతీయ జెండా ఎగురవేసి జాతీయ గీతాలాపన చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు బైరెడ్డి రమణారెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, మల్యాల గ్రామ సర్పంచ్ గురుకుంట్ల సాంబయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పులరమేశ్, పాపిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, రాజేందర్, రాంబాబు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో మొక్కలు నాటుతున్న అధికారులు, గ్రామస్తులు

పీఆర్టీయూ కార్యవర్గం

సైదాపూర్: పీఆర్టీయూ తెలంగాణ సైదాపూర్ మండల శాఖను శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నెల్లి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా వొడ్నాల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

మానకొండూర్: పీఆర్టీయూ తెలంగాణ మానకొండూర్ మండల శాఖ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా వరుకోలు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఆవాల వినోద్‌కుమార్‌ను నియమిస్తూ పీఆర్టీయూ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లెపాటి వేణుగోపాల్‌రావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

సైదాపూర్ తహసీల్దార్‌గా మంజుల



మంజుల

సైదాపూర్: సైదాపూర్ తహసీల్దార్‌గా దూలం మంజుల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నుంచి బదిలీపై వచ్చారు. మంజులకు సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

శంకరపట్నం తహసీల్దార్‌గా అనుపమ

శంకరపట్నం: శంకరపట్నం తహసీల్దార్‌గా అనుపమ శుక్రవారం విధుల్లో చేరారు. ఇటీవల భూపాలపల్లి జిల్లా నుంచి సమ్మయ్య శంకరపట్నం తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. వారం రోజులు గడవక ముందే పెద్దపల్లి జిల్లాలో పనిచేస్తున్న అనుపమను తహసీల్దార్‌గా కలెక్టర్ బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. శంకరపట్నం డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌కు తహసీల్దార్‌గా పదోన్నతి వచ్చింది.

క్లుప్తంగా

ఓటుహక్కు వినియోగంపై అవగాహన సదస్సు

చొప్పదండి: పట్టణంలోని జూనియర్ కళాశాలలో శుక్రవారం ఓటుహక్కు వినియోగంపై ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పద్దెనిమిదేళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఏ. శరత్‌బాబు సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. హర్యానాలో జరిగిన ఎన్ఎస్ఎస్ శిబిరానికి చొప్పదండి నుంచి ఇద్దరు విద్యార్థులు హాజరు కాగా వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌కుమార్, కనకయ్య, సబితారాణి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

హుజూరాబాద్‌: ఇంటింటికీ జాతీయ జెండాను అందించి ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేసి దేశభక్తిని చాటాలనే కేంద్ర ప్రభుత్వ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలో పోస్టల్ ఉద్యోగులు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పోస్టాఫీస్ సబ్ డివిజనల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జె.అనంతరామ్ మాట్లాడుతూ... 12వ తేదీతో జాతీయ జెండాల విక్రయం పూర్తవుతున్నందున ప్రజలు తపాలా శాఖ ఆధ్వర్యంలో విక్రయించే జాతీయ పతాకాలను కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ప్రధాన పోస్టాఫీస్ పోస్ట్ మాస్టర్ ఊకంటి మహేందర్, పోస్టల్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన ఉద్యోగులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేయగా జమ్మికుంట మున్సిపల్‌లో వివిధ శాఖలకు నూతనంగా నియామకమైన ఉద్యోగులు మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేయగా చైర్మన్ శుభాకాంక్షలు తెలిపి మున్సిపల్ అభివృద్ధికి ఉద్యోగులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ పరామర్శ

వీణవంక: మండల కేంద్రానికి చెందిన జోజుల హేమలత అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. వెంట సర్పంచ్ కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తిరుపతిరెడ్డి, మల్లయ్య యాదవ్, మహేశ్‌గౌడ్, రాజు తదిరతులు ఉన్నారు,.

గద్దర్‌కు నివాళి



చొప్పదండి: ప్రజాగాయకుడు గద్దర్‌కు చొప్పదండిలోని కళాకారుల బృందం శుక్రవారం పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో నివాళి అర్పించారు. జానపద కళారత్న అవార్డు గ్రహీత డోలక్ రాజు ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చీకట్ల లచ్చయ్య, దండె రాజయ్య, పిట్టల రఘు, దండె కొమురయ్య, మంచికట్ల విఠల్, పూదరి నారాయణ, దండె లింగన్న, దూస రాము, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



జమ్మికుంట: తెలంగాణ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో 13న కోరుట్లలో నిర్వహించే ఛలో కోరుట్ల పద్మశాలీ యుద్ధభేరికి పద్మశాలీలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ ఐక్యవేదిక రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిరంజీవి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో రాష్ట్ర అధ్యక్షుడు వీరమోహన్ పిలుపు మేరకు ఛలో కోరుట్ల రాజ్యాధికారిక సాధన యుద్ధభేరి గోడ పోస్టర్ ఆవిష్కరించారు. పద్మశాలీల ఆత్మగౌరవం, రాజ్యాధికారం, ఐక్యతకు పునాదిగా రాజకీయ పార్టీలకు అతీతంగా రావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గం నుంచి పద్మశాలీ బిడ్డలు నిలబడాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కిషోర్, రాష్ట్ర కార్యదర్శి రమేశ్, కిరణ్, సాయి స్వరణ్, శ్రీనివాస్, రచ్చ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పూలబొకే అందిస్తున్న విద్యార్థులు

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శంకుస్థాపన, గ్రామంలో నిర్మించిన గౌడసంఘం భవనాన్ని ప్రారంభించారు. అంబేడ్కర్ విగ్రహం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సరోజన, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఎంపీటీసీ శోభారాణి, విండో చైర్మన్లు తిరుపతిరెడ్డి, సంజీవరెడ్డి, ఉపసర్పంచ్ సంపత్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, ఎంపీడీవో బషీరొద్దీన్, ఎంఈవో కేవీ నర్సింహారెడ్డి, ఏఈ తిరుపతి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన సిరిసిల్ల సాయికుమార్ ఇటీవల మృతిచెందగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ మృతుడి కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. వీరితోపాటు మాజీ ఎంపీటీసీ గణేష్, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, శామంతుల శ్రీనివాస్, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

మండలంలోని మెట్‌పల్లి గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంతడ్పుల శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మోరెశ్రీనివాస్‌ను శుక్రవారం కేశవపట్నం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గ్రామంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వస్తుండడంతో ఎమ్మెల్యే పర్యటనను అడ్డుకుంటారని అదుపులోకి తీసుకున్న పోలీసులు పర్యటన ముగిశాక వదిలిపెట్టారు.

పథకాలకు అర్హులను ఎంపిక చేయాలి

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దళితబంధు, గృహలక్ష్మి, తదితర పథకాలకు అర్హులను ఎంపిక చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ పథకాల అమలుపై నియోజకవర్గంలోని అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులకు గృహలక్ష్మి పథకంలో ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతర పథకాలకు అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో డీఆర్డీవో పీడీ శ్రీలతారెడ్డి, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

మండలంలోని కురిక్యాల గ్రామం నుంచి ఆసిఫ్‌నగర్ వరకు రూ.19 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

నేతన్నల జీవితాల్లో కేసీఆర్ వెలుగులు నింపారు

చొప్పదండి: రాష్ట్రం ఏర్పడిన తర్వాత బొంబాయి, భీవండికి వలసలు తగ్గిపోయాయని, నేత కార్మికుల జీవితాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారని ఎమ్మెల్యే అన్నారు. పట్టణంలో శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని జౌళిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. కేంద్రం జీఎస్టీ ఎత్తేయడం లేదని, నేత కార్మికులను ప్రోత్సహిస్తలేదని విమర్శించారు. ఈసందర్భంగా నేత కార్మికులు ర్యాలీ నిర్వహించారు. రూ.ఐదు లక్షల బీమా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. అనంతరం చేనేతపై నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎంపీపీ చిలుక రవీందర్, చేనేత డీడీఎం అశోక్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, నేత కార్మికులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గంగాధర: భారీ వర్షాలతో నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు నష్టపోతే స్థానిక ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వారి సమస్యలను పట్టించుకోవడం లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం విమర్శించారు. దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారి మధురానగర్ చౌరస్తాలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. వర్షాలకు రోడ్లు, కల్వర్టులు కొట్టుకుపోయాయని, పంటపొలాల్లో ఇసుక మేటలు వేయడంతో రైతులు పంటలు నష్టపోయారని దెబ్బతిన్నాయన్నారు. ఎమ్మెల్యే బాధితులను పరామర్శించలేదు, నష్టాలను, దెబ్బతిన్న రోడ్లను పరిశీలించలేదని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించే వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. అనంతరం పోలీసులు నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాస్తారోకోలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



తిమ్మాపూర్: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పశువులకు టీకాలు వేయించాలని మన్నెంపల్లి సర్పంచ్ మేడి అంజయ్య అన్నారు. గ్రామంలోని పాలకేంద్రం ఆవరణలో సంఘ అధ్యక్షుడు కమ్మం ఓదెలు ఆధ్వర్యంలో టీకాల పంపిణీని ప్రారంభించారు. మండలం పశువైద్యాధికారి సురేందర్‌రెడ్డి పోరండ్ల పశువైద్యాధికారి కమలాకర్ వ్యాక్సిన్లు వేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. సంఘం కార్యదర్శి గుంటీ మధుకర్, పాలకవర్గ సభ్యులు నాంపల్లి తిరుపతి పార్నంది మల్లేశ్, సభ్యులు రావుల మల్లేశ్ బీనపెల్లి రామస్వామి, పొట్ట పరమేశ్వరి, నాంపల్లి సాయి కొలిపాక మహేశ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



వినతిపత్రాన్ని అందిస్తున్న నాగి శేఖర్

రామడుగు: చొప్పదండి నియోజకవర్గంలోని రామడుగు, గంగాధర, చొప్పదండి మండలాల్లో సమస్యలను పరిష్కరించాలని యువజన కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ శుక్రవారం కలెక్టర్ గోపికి వినతిపత్రం అందజేశారు. రామడుగు సమీపంలో బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, నారాయణపూర్ రిజర్వాయర్ కట్ట ఎత్తు పెంచాలని, గుండి గ్రామ చెరువు మత్తడి వద్ద బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని దాని స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్‌పార్టీ నాయకులు గుడ్ల మల్లికార్జున్, నీలం దేవకిషన్, ప్రేమ్‌సాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై డీపీవోకు ఫిర్యాదు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శిపై డీపీవోకు పి. రాజయ్య అనే వ్యక్తి శుక్రవారం ఫిర్యాదు చేశాడు. గ్రామంలో సర్వే నంబర్ 275 వ్యవసాయ భూమిలో అక్రమంగా ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని, నచ్చినవారికి అనుమతులిస్తూ, ఇతరులకు అనుమతులివ్వకుండా నిబంధనలు చూపెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు రద్దు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవదాస్

జమ్మికుంట: జమ్మికుంట కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాసం దేవదాస్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని రామాలయం ప్రాంగణంలో అసోసియేషన్‌కు చెందిన 25 మంది డీలర్లు, సభ్యులు సమావేశం నిర్వహించి ప్రధాన కార్యదర్శిగా అనిల్, కోశాధికారిగా అయిత ఓంకారంతోపాటు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు కాసం దాసు మాట్లాడుతూ.. నమ్మకంతో ఎన్నుకున్న డీలర్లకు అందుబాటులో ఉంటూ, అసోసియేషన్ సభ్యులతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీలర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



బట్ట సంచులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తిలో శుక్రవారం సర్పంచ్ అందె స్వరూపస్వామి గ్రామస్తులకు బట్ట సంచులను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు ఉన్నందున జీపీ పాలకవర్గం నిర్ణయం మేరకు సంచులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వార్డుల సభ్యులు విష్ణుమాచారి, శ్రీను, సిరాజ్, శ్రీనివాస్, పాఠశాల కమిటీ చైర్మన్ ఉస్మాన్, హెచ్ఎం లక్ష్మణ్‌రావు, వైద్యాధికారి నిర్మల, లక్ష్మిచారిటబుల్ ట్రస్టు చైర్మన్ రఘునాథరెడ్డి పలువురు పాల్గొన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి జన్‌ధన్ ఖాతాలు

ఇందుర్తిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో పదేళ్లకు పైబడినవారు ఇప్పటివరకు బ్యాంకు ఖాతా లేనివారికి ఉచితంగా ప్రధాన మంత్రి జన్‌ధన్ ఖాతాలు ఇస్తున్నామని బ్యాంకు మేనేజర్ ఆశిష్‌గోయల్ తెలిపారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడారు. ఇందుర్తితో పాటు బ్యాంకు పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖాతా తీసుకోవడం వల్ల భవిష్యత్‌లో మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ వంటి నగదు రహిత లావాదేవీలు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అకౌంటెంట్ ఏలేటి రమేశ్, గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు ఉన్నారు.

నూతన కార్యవర్గం



రామడుగు: రామడుగు మండల ఒగ్గు, బీర్ల కళాకారుల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలో సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒగ్గు, బీర్ల కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒగ్గరి రాజు, గౌరవ అధ్యక్షుడు రాజ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో మండల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సాయిల్ల రాగుల మల్లయ్య, కోశాధికారిగా ఒగ్గరి తిరుపతి ఎన్నికయ్యారు.

డీటీఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

గన్నేరువరం: డీటీఎఫ్ (డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) గన్నేరువరం మండల శాఖ అధ్యక్షుడు వెంకట నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పొన్నాల రాజు ఆధ్వర్యంలో గుండ్లపల్లిలో శుక్రవారం డీటీఎఫ్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, జోన్ కన్వీనర్ కానగంటి రాజమౌళి హాజరయ్యారు. అక్టోబర్‌లో నిర్వహించే రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆగస్టు 12న జిల్లా కేంద్రంలో ర్యాలీ, సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో చేపట్టే ధర్నాకు ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌శ్రీం పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ట్రెజరీ ఆమోదం పొంది, నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటిని సత్వరం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీరాముల నరేందర్, బద్దం సురేందర్‌రెడ్డి, వేణు, మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ధర్నాను విజయవంతంచేయండి



డీటీఎఫ్ కమిటీ సభ్యులు,ఉపాధ్యాయులు

ఇల్లందకుంట: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ)పిలుపు మేరకు 12న కలెక్టరేట్ వద్ద పది గంటలకు నిర్వహించే ధర్నాను విజయవంతంచేయాలని డీటీఎఫ్ రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్ పి.ఈశ్వర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. సీపీఎస్ రద్దు, పీఆర్సీ కమిటీ, ఐఆర్, బదిలీ, పదోన్నతులు చేపట్టాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపచేయాలని, ఐటీ మినహాయింపు పరిమితి పెంచాలని, మోడల్‌స్కూల్, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్లతో ధర్నా చేస్తున్నామని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతంచేయాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు సీహెచ్.వేణు, ప్రధాన కార్యదర్శి సంపత్, హెచ్ఎం సాంబయ్య, టీచర్లు సమ్మిరెడ్డి, వెంకట్రాజం, శంకర్, మారుతి ప్రసాద్, స్వామి, సత్యనారాయణ, నాగరాజు, మల్లయ్య, వీరస్వామి, పద్మ, శ్రీదేవి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

చేనేత ఉత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రథమ బహుమతి పొందిన చిత్రం

చొప్పదండి: జాతీయ చేనేత వారోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో చొప్పదండి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. నియోజకవర్గ స్థాయిలో హ్యాండ్లూమ్ ఆర్ట్ కాంపిటీషన్‌లో సమీర ప్రథమ, వ్యాస రచన పోటీలో ఎస్. సంతోష్ ద్వితీయ బహుమతి. హ్యాండ్లూమ్ డ్రెస్ కాంపిటిషన్‌లో కె. శ్రీవాణి ప్రథమ, బి. అర్చన ద్వితీయ బహుమతులు, డ్రాయింగ్‌లో ఆర్ట్ టీచర్ కె. చంద్రశేఖర్ ప్రథమ బహుమతి సాధించారు. విద్యార్థులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, హెచ్ఎం కరుణ, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యక్తిపై కేసు నమోదు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక గ్రామానికి చెందిన మహేందర్ (33)పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. యూట్యూబ్‌లో పోలీసులపై అసత్య ప్రచారం చేస్తూ వీడియోలు వైరల్ చేశాడని, దీంతో కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.